వైభవంగా దేవి శరన్నవరాత్రులు


రాయచోటి వీరభద్రాలయంలో కామాక్షీదేవి అలంకరణలో భద్రకాళీదేవి

జిల్లావ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.
- న్యూస్‌టుడే, బృందం


రాజంపేట సాధుకామాక్షమ్మ ఆలయంలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవి


నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి అమ్మవారు

ఆలయాల నిర్వహణ పద్దు పెంపు!

● ధూప, దీప, నైవేద్యం పథకానికి భరోసా
● రూ.10 వేలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ

-న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం

చిన్న ఆలయాల నిర్వహణకు ఆర్థిక కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తూ ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొంది. నిన్న టిదాకా చాలీచాలని నిధులతో ఆలయ ఆలనాపాలనా కష్టంగా ఉండేది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులు ఆరాధించే మందిరాల బాగోగులకు భరోసా ఇవ్వాలని ముందుకొచ్చింది. ప్రస్తుతం ఇస్తున్న మొత్తాన్ని మరింత పెంచడంతో అర్చకులు, భక్తులు ఊరట చెందుతున్నారు.

● వైఎస్సార్ జిల్లాలో దేవాదాయ శాఖ పర్యవేక్షణలో అన్ని రకాల ఆలయాలు కలిపి 3,407 ఉండగా, 547 ఆలయాల్లో ధూప, దీప, నైవేద్య పథకం అమలవుతోంది. వీటికి ప్రస్తుతం ప్రతినెలా రూ.5 వేలు చొప్పున ఇస్తున్నారు. ఇందులో పూజాకైంకర్యాలకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.2 వేలు, అర్చకుడికి రూ.3 వేలు వంతున ఇస్తున్నారు. ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇక మీదట పూజల అవసరాల నిమిత్తం రూ.3 వేలు, అర్చకుడికి రూ.7 వేలు వంతున ఇవ్వాలని అనుమతిచ్చారు. గతంలో నెలకు రూ.27.35 లక్షలు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉండేది. ఇకపై రూ.54.70 లక్షలు ఖర్చు చేసుకోవచ్చు. ఏడాదికి రూ.30 వేల లోపు వార్షిక ఆదాయం ఉన్న వాటికే వర్తింపజేయనున్నారు. రానున్నరోజుల్లో పథకం కింద లబ్ధి పొందే ఆలయాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

● అన్నమయ్య జిల్లాలో దేవదాయశాఖ పర్యవేక్షణలో 1,663 ఆలయాలుండగా, ధూప, దీప, నైవేద్య పథకం కింద ప్రస్తుతం 269 ఆలయాలు లబ్ధి పొందుతున్నాయి. మదనపల్లె నియోజకవర్గంలో 27, తంబళ్ల పల్లెలో 35, పీలేరులో 36, రైల్వేకోడూరులో 46, రాజంపేటలో 52, రాయచోటి నియోజకవర్గంలో 73 మందిరాల్లో అమలు చేస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ.5 వేలు వంతున రూ.13.45 లక్షలు వెచ్చిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఇకమీదట రూ.26.90 లక్షల వరకు నిర్వహణకు వాడుకోవచ్చు. ఇప్పటికే మరికొన్ని ఆలయాలకు వర్తింపజేయాలని ప్రతిపాదనలొచ్చాయి. ఉన్నత స్థాయి నుంచి అనుమతులకు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేస్తాం

దేవాదాయశాఖ పరిధిలో ప్రస్తుతం ధూప, దీప, నైవేద్యం పథకం కింద ఒక్కో ఆలయానికి నెలకు రూ.5 వేలు ఇస్తున్నాం. ఇకపై రూ.10 వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటాం.
- మల్లికార్జున ప్రసాద్, విశ్వనాథ్, జిల్లా అధికారులు, దేవాదాయశాఖ

పల్లె దారులకు మోక్షం!

● అధ్వానంగా ఉన్నవాటికి తొలి ప్రాధాన్యం
● త్వరలోనే ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు


రెండేళ్లు కిందట కంకర పరిచి వదిలేసిన బ్రహ్మంగారిమఠం మండలం నాగిశెట్టిపల్లె రహదారి

-ఈనాడు, కడప

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లె రహదారులు అడుగుకో గుంత.. గజానికో గొయ్యితో అధ్వానంగా తయారయ్యాయి. గత అయిదేళ్లలో తట్టమట్టికి నోచుకోని రహదారులున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలోని రహదారుల మరమ్మతులకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. రహదారిపై 20 కిలోమీటర్ల కంటే వేగంగా వాహనాన్ని నడపలేని దుస్థితిలో ఉన్న వాటికి తొలి ప్రాధాన్యమివ్వనుంది. రెండో ప్రాధాన్యంగా 40 కిలోమీటర్ల కంటే వేగంగా వాహనాన్ని నడపలేని రహదారులను గుర్తించింది. వీటిని మలి దశలో మరమ్మతులు చేపట్టాలనే ప్రాధమ్యాలను ఎంపిక చేసుకుంది. ఈ మేరకు రహదారులను గుర్తించి మరమ్మతులు చేసేవిధంగా చర్యలకు ఉపక్రమించనుంది.

● వివిధ పథకాలు, బ్యాంకు రుణాల కింద చేపట్టిన రహదారుల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పనులు సైతం కంకర పరిచిన అనంతరం ఆపేయడంతో రాకపోకలకు ప్రజల నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. వీటిని పూర్తి చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లో 705 రహదారుల నిర్మాణపనులు అసంపూర్తిగా ఉన్నాయి. సింహభాగం పనులు పులి వెందుల నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఇక్కడ పాడా కింద రూ.700 కోట్ల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. కొందరు గుత్తేదారులు బిల్లుల కోసం న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. ఇటువంటి పరిస్థితుల్లో ముందుకెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి జిల్లాస్థాయిలో ప్రతిపాదనలు తయారు చేయించి స్వీకరించింది. త్వరలోనే పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ పీఎంజీఎస్‌వై, ఏపీఆర్ఆర్‌పీ, నాబార్డు రుణం, ఎస్‌డీఎంఎఫ్, పంచాయతీరాజ్ రహదారులు, భవనాలశాఖ కింద పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఇవన్నీ త్వరలోనే కొలిక్కి వచ్చి క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టేవిధంగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నారు.


అధ్వానంగా రాయచోటి మండలం యండపల్లి-మాధవరం రహదారి

ఇదే తరహాలో రహదారులు, భవనాలశాఖ విభాగంలోనూ కసరత్తు జరుగుతోంది. రెండు జిల్లాల్లో వందలాది కిలోమీటర్ల రాష్ట్ర, జిల్లా రహదారులున్నాయి. భారీ వర్షాలు, తుపాన్ల తాకిడికి 80 శాతం రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రజలు ప్రయాణించడానికి వీల్లేనంతగా ఛిద్రమయ్యాయి. వైకాపా అధికారంలో ఉన్నన్నాళ్లు నిర్వహణను పట్టించుకోలేదు. ప్రజలు ప్రమాదాలకు గురైన పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితుల్లో అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన రహదారులపై ప్రతిపాదనలను ప్రభుత్వం తెప్పించుకుంది. కొన్నింటికి ఇప్పటికే పరిపాలనాపరమైన అనుమతులు సైతం ఇచ్చింది. ఆమోదించిన పనులకు వెంటనే టెండర్లు పిలిచి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు రెండు జిల్లాల పరిధిలో ముమ్మర కసరత్తు జరుగుతోంది. ఇన్నాళ్లు బదిలీల వ్యవహారంలో ఉన్న రహదారులు, భవనాలశాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాలు ఇప్పుడే కుదుటపడ్డాయి. రహదారులకు మరమ్మతులు చేపట్టడానికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నాయి.

జిల్లాలో మోస్తరు వర్షం

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గురువారం రాత్రి కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం కలిగింది. ఈ మేరకు 16 మండలాల్లో వర్షం కురవగా మిగిలిన 14 మండలాల్లో చినుకుజాడ లేదు. రాజంపేట మండలంలో అత్యధికంగా 83.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గాలివీడులో 83.0, పుల్లంపేటలో 54.2, నందలూరులో 33.4, రామాపురంలో 23.6, పెనగలూరు 22.6, వీరబల్లి 19.0. ఓబులవారిపల్లి 16.0, సంబేపల్లె 15.6, లక్కిరెడ్డిపల్లి 12.6, చిన్నమండెం 11.8, పెద్దముడియం 11.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. ఉలవ పంట సాగుకు అదును ఉండడంతో వర్షం కురిసిన ప్రాంతాల్లో రైతులు పంట సాగు చేయవచ్చని డీఏవో చంద్రానాయక్ తెలిపారు.

జడ్పీ డిప్యూటీ సీఈవోగా మైథిలి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జడ్పీ డిప్యూటీ సీఈవోగా మైథిలీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె డ్వామాలో ఏపీడీగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. జడ్పీ పరిపాలనాధికారులు భాస్కర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌లతో కలిసి జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా పూలమొక్క అందించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక : కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు వంద రోజుల ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టితో విజన్ ఆంధ్ర-2047 తీసుకొస్తున్నారన్నారు. జిల్లాలోని కీలక రంగాలు, అంశాలపైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పన చేసుకుని రానున్న రెండో వంద రోజులు డిసెంబరు 31 నాటికి లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రణాళిక రూపకల్పనకు సంబంధించి అవగాహన కల్పించారు. సమావేశంలో సీపీవో వెంకటపెద్దయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణానికి 240 ప్రత్యేక బస్సులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: దసరా సెలవుల అనంతరం ప్రయాణికులు స్వస్థలాలకు వెళ్లేందుకు 240 ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం గోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బస్సులు ఈ నెల 13 నుంచి ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఇవి సాధారణ ఛార్జీలతో నడుస్తాయని, ముందస్తు రిజర్వేషన్ సౌకర్యముందన్నారు. హైదరాబాద్‌కు 67, బెంగళూరుకు 79, విజయవాడకు 42, చెన్నైకు 12 సర్వీసులతో పాటు తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం ప్రాంతాలకు 40 బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 7, 8 తేదీల్లో తిరుపతికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ నేపథ్యంలో అన్ని రకాల బస్సు పాసులను జారీని నిలిపేస్తున్నట్లు ఆర్.ఎం.తెలిపారు. తిరిగి 7వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్లు తెరుస్తామన్నారు.

వైకాపా పాపం... వైద్యకళాశాలకు శాపం!

● నిలిచిపోయిన భవనాల నిర్మాణపనులు
● వైద్యులు, సిబ్బందికి తప్పని ఇబ్బందులు

-న్యూస్‌టుడే, మదనపల్లె వైద్యం

గత వైకాపా ప్రభుత్వంలో మదనపల్లె మండలం ఆరోగ్యవరం సమీపంలో 95.44 ఎకరాల్లో రూ.475 కోట్లతో చేపట్టిన వైద్యకళాశాల నిర్మాణ పనులు నిధుల్లేకపోవడంతో నత్తనడకన సాగుతున్నాయి. ఏడాది ముందే ప్రారంభం కావాల్సిన వైద్యకళాశాల పనుల్లో ఆలస్యంతో ప్రారంభానికి నోచుకోలేకపోయింది. 2021లో ప్రారంభం కావాల్సిన పనులను 2022లో ప్రారంభించారు. 30 నెలల్లో భవనాలు పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 40 శాతం మాత్రమే జరిగాయి. దీంతో ఎన్ఎంసీ అధికారులు పరిశీలించి అనుమతులు నిరాకరించడం గమనార్హం.


భవన నిర్మాణాలు పూర్తికాని మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల

● వైద్యకళాశాలకు అనుబంధంగా మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిని ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిగా మార్పు చేశారు. మొత్తం 150 పడకలున్న ఆసుపత్రిని 440 పడకలకు పెంచారు. ఆసుపత్రి పైభాగంలో తాత్కాలిక భవనాలు నిర్మించి వార్డులు ఏర్పాటు చేశారు. గతంలో రోజుకు ఓపీ 700 ఉండగా, ప్రస్తుతం 1,200కు చేరింది. గతంలో ఇన్‌పేషెంట్లు 100 మంది వరకు ఉండగా, ప్రస్తుతం 250 మంది వరకు ఉంటున్నారు. ఆసుపత్రిలో వైద్యసేవలు పెరిగే సమయానికి వైద్యకళాశాల అనుమతి నిరాకరించడంతో సర్వజన బోధనాసుపత్రి ఉంటుందా.. లేక మళ్లీ జిల్లా ఆసుపత్రిగా మారుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆసుపత్రిలో వైద్యకళాశాల, జీజీహెచ్ తరపున వచ్చిన వైద్యులు తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బోధన కోసం వచ్చిన వైద్య సిబ్బంది గత ఆరునెలలుగా ఖాళీగా కూర్చుని వెళ్తున్నారు.

● గత ప్రభుత్వం మదనపల్లె వైద్య కళాశాల సిబ్బంది నియామకాల్లో చేతివాటం ప్రదర్శించింది. రూ.లక్షలు దోచుకుని కొంతమందికి ఉద్యోగాలిచ్చింది. ఉద్యోగాలైతే ఇచ్చింది గానీ వారికి వేతనాలివ్వాలన్న బాధ్యత మరిచిపోయింది. గత ప్రభుత్వం తప్పిదంతో నేటికీ వారికి వేతనాలందక అవస్థలు పడుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుని వేతనాలకు పడిగాపులు కాస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక్కరోజు ముందే సుమారు 102 మందిని నాటి ప్రభుత్వ పాలకులు, వైద్యశాఖ అధికారులు ఒక్కోపోస్టుకు రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు తీసుకుని పోస్టింగులిచ్చారు. దీనిపై ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేశారు. ఈ కోటాలో వచ్చిన సిబ్బందిలో ఒప్పంద సిబ్బందికి మాత్రమే వేతనాలందుతున్నాయి. పొరుగుసేవల సిబ్బందికి వేతనాలందడంలేదు.

● మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో పెంచిన పడకల ప్రకారం 484 మంది సిబ్బంది అవసరం. వీరిలో 223 మందిని మాత్రమే భర్తీ చేశారు మిగిలిన 261 మంది నియామకాలు జరగలేదు. వైద్య కళాశాలకు 77 మంది వైద్యులను నియమించగా, 61 మంది మాత్రమే వచ్చారు. మిగిలిన 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్య కళాశాలలో 58 మంది సీనియర్ రెసిడెంట్స్ అధికారులకు కేవలం ముగ్గురు మాత్రమే ఉండగా, 55 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో 18 మంది ట్యూటర్స్‌కు నలుగురు విరమణ చేశారు. ఒప్పంద, పొరుగుసేవల కింద 25 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో ఇద్దరు విరమణ చేయగా, మిగిలినవారు విధుల్లో ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రికి వైద్యకళాశాలకు వచ్చిన వైద్యులే చికిత్స అందిస్తున్నారు. వైద్య కళాశాల రద్దు కావడంతో చాలా విభాగాల వైద్యులు వెనక్కు వెళ్లే అవకాశం ఉంది. జీజీహెచ్ వైద్యులనైనా కొనసాగిస్తే ఇక్కడ వైద్యసేవలు కుంటుపడకుండా ఉంటాయని రోగులు కోరుతున్నారు. వైద్య కళాశాలకు సంబంధించి ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం రాలేదని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున తెలిపారు.

వంతెన కింద నీళ్లు... రాకపోకలకు కన్నీళ్లు



ఓబులవారిపల్లె మండల కేంద్రంలో రైల్వే వంతెన మార్గం అధ్వానంగా తయారైంది. దీంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన కింద వాన నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో విజయరావు మాట్లాడుతూ రైల్వేవంతెన కింద మార్గం చాలా సమస్యగా ఉన్న మాట వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పామని, వంతెన కింద నీళ్లు నిల్వ కుండా చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

రాయచోటి : పీఎం కిసాన్ యోజన కింద 18వ విడత నిధులు శుక్రవారం విడుదలవుతాయని డీఏవో చంద్రానాయక్ తెలిపారు. జిల్లాలోని 1,73,591 మంది రైతుల ఖాతాలకు రూ.34.72 కోట్లు జమ చేయనున్నట్లు తెలిపారు.

సీటీఐను అడ్డుకున్నారు!

◆ ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఆప్కాబ్
◆ గుత్తేదారు సంస్థతో ఏపీఐఐసీ ఒప్పందం
◆ వైకాపా నేతల తీరుతో నిలిచిన పనులు

-న్యూస్‌టుడే, కడప నగరపాలక

కో-ఆపరేటివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సీటీఐ)... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ కడపలో నిర్మించాలనుకున్న ప్రతిష్ఠాత్మక శిక్షణ కేంద్రం. గత వైకాపా ప్రభుత్వంలో ప్రతిపాదించిన భవన నిర్మాణానికి ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అడుగడుగునా అడ్డుపడడంతో మొదట్లోనే పనులకు కాలం చెల్లిపోయింది. అప్పట్లో జిల్లా అధికార యంత్రాంగం సైతం వైకాపా నేతలకు వంత పాడడంతో భారీ నిర్మాణం ఆదిలోనే నిలిచిపోయింది.


కడపలో సీటీఐ నిర్మించాల్సిన ప్రాంతం

● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ కడప నగరంలో కో-ఆపరేటివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి 2022, మార్చిలో ఏపీఐఐసీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది పనులకు సంబంధిత అధికారులు 2023, ఆగస్టులో పరిపాలనా ఆమోదం, అక్టోబరులో సాంకేతిక ఆమోదం ఇచ్చారు. రూ.23.50 కోట్ల అంచనాతో కడప నగరంలోని రైలునిలయం రోడ్డులో ప్రావిడెంటు ఫండ్ కార్యాలయం - ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయానికి మధ్య గల సువిశాల స్థలంలో శిక్షణ కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించారు. కడప కలెక్టరేట్ ఆర్టీసీ బస్టాండు, రైలునిలయాలకు అత్యంత సమీపంలోనే ఈ స్థలం ఉంది. ఏపీ ఐఐసీ పనులకు టెండర్లు పిలవగా కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అర్హత సాధించింది. 2023, డిసెంబరులో ఏపీఐఐసీ ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. సదరు సంస్థ సీటీఐ నిర్మించాల్సిన స్థలంలోని పాత నిర్మాణాలను తొలగించి పనులు ప్రారంభించింది. అన్నీ సజావుగా సాగి ఉంటే అక్కడ ఈ పాటికి సీటీఐ నిర్మాణపనులు ముమ్మరంగా జరుగుతూ ఉండేవి. వైకాపా ప్రజాప్రతినిధులు పనులకు మోకాలడ్డారు.

● సీటీఐ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో కడప నగరపాలక సంస్థ కార్యాలయాన్ని రూ.34 కోట్లతో నిర్మించాలన్న ప్రతిపాదనను తెరపైకి తెచ్చి తీర్మానించారు. దీనిపై భిన్నాభిప్రాయాలు రావడంతో పాత మున్సిపల్ కార్యాలయంలో నగరపాలక సంస్థ కార్యాలయాన్ని నిర్మించేందుకు అప్పటి సీఎం జగన్‌తో శంకుస్థాపన చేయించినా నిర్మాణపనులు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో సీటీఐ నిర్మించాలనుకున్న స్థలంలో వైకాపా జిల్లా కార్యాలయ భవనం నిర్మించాలనే అంశం తెరపైకి వచ్చింది. దీంతో సీటీఐ నిర్మాణపనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆప్కాబ్ వర్గాలు ప్రతిష్ఠాత్మకమైన ఈ నిర్మాణాన్ని ముందుకు తీసుకుపోవడానికి విశ్వప్రయత్నాలు చేసినా అప్పటి జిల్లా అధికార యంత్రాంగం సహకరించకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. దీనితో ఆప్కాబ్ మేనేజ్‌మెంటుబోర్డు 2024, జులైలో జరిగిన బోర్డు సమావేశంలో కడప సీటీఐ పనులు రద్దు చేశారు. ఏపీఐఐసీ ద్వారా అమరావతిలో సీటీఐ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. వైకాపా అధికారంలో ఉండగా చేతివరకు వచ్చిన ప్రాజెక్టులను కాలితో అడ్డుకుని అధికారం కోల్పోయిన అనంతరం శిక్షణ సంస్థల తరలింపుపై ఉద్యమాలు చేస్తామని చెప్పడంపై జిల్లా వాసులు విస్తుపోతున్నారు.

ఎంపీడీవోలకు బదిలీలు

కడప ఏడురోడ్లు, వేంపల్లె, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేసే 35 మంది ఎంపీడీవోలు బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. వీరి బదిలీలు గత నెల 22నే పూర్తయినా ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ, స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలతో పాటు పింఛన్ల పంపిణీ ఉండటంతో ఈ నెల 2వ తేదీ వరకు వారిని రిలీవ్ చేయలేదు. గురువారం రాత్రి కలెక్టర్ల అనుమతితో ఉత్తర్వులు సిద్ధమయ్యాయి. బదిలీ అయిన వారిలో ఉమ్మడి కడప జిల్లా నుంచి 21 మంది, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, తూర్పు గోదావరి జిల్లాల నుంచి 7 మంది ఉన్నారు.

ఏడుగురికి అదనపు బాధ్యతలు...

ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించి ఏడుగురికి ఇన్‌ఛార్జి ఎంపీడీవోలుగా నియమిస్తూ జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. వీఎన్‌పల్లె ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న చంద్రమౌళీశ్వర్, పులివెందులలో పనిచేస్తున్న రామాంజనేయరెడ్డి, ఒంటిమిట్ట ఏవో సోమశేఖర్, అట్లూరు ఏవో భాస్కర్‌బాబులను ఆయా మండలాల ఇన్‌ఛార్జి ఎంపీడీవోలుగా నియమించారు.

● ఈవోపీఆర్డీలుగా పనిచేస్తున్న వారిలో మైలవరానికి రామచంద్రారెడ్డి, పోరుమామిళ్లకు రమణారెడ్డి, బ్రహ్మంగారిమఠానికి నాగార్జునను ఇన్‌ఛార్జి ఎంపీడీవోలుగా బాధ్యతలు అప్పగించారు.

బదిలీ అయిన ఎంపీడీవోల వివరాలు..

పేరు	పనిచేస్తున్న మండలం	బదిలీ అయిన ప్రాంతం
సి. వెంకట రమణయ్య	పెద్దముడియం	ఎర్రగుంట్ల
జె. సుజాతమ్మ	అట్లూరు	నందలూరు
జి. రెడ్డయ్య	ఒంటిమిట్ట	లక్కిరెడ్డి పల్లె
సి. వెంకటేశు	పులివెందుల	రాయచోటి
కె. కులాయమ్మ	ప్రొద్దుటూరు	వేంపల్లె
ఎ. వి. రమణారెడ్డి	వీఎన్‌పల్లె	రాజుపాలెం
సి. రామకృష్ణయ్య	గోపవరం	దువ్వూరు
కె. వి. శ్రీధర్ నాయుడు	చాపాడు	మైదుకూరు
సి. ఏ. జవహర్‌బాబు	సిద్దవటం	గాలివీడు
సి. దివిజ	వేంపల్లె	ఖాజీపేట
పి. జయశ్రీ	వల్లూరు	పుల్లంపేట
ఎస్. షంషాద్‌బాను	మైలవరం	పెద్దముడియం
ఎస్. విజయరావు	ఓబులవారిపల్లె	పెనగలూరు
వి. వరప్రసాద్	పెనగలూరు	రాజంపేట
ఎ. మల్‌రెడ్డి	రాయచోటి	ఓబులవారిపల్లె
ఎన్. రామచంద్ర	టి. సుండుపల్లి	సంబేపల్లి
జి. వి. రఘురాం	పుల్లంపేట	వల్లూరు
ఎస్. ఫణిరాజ కుమారి	రాజంపేట	సిద్ధవటం
ఎస్. శ్రీనివాసరెడ్డి	గాలివీడు	లింగాల
ఎస్. సూర్యనారాయణరెడ్డి	రామాపురం	ప్రొద్దుటూరు
ఎ. జాషువా	కోడూరు	రామాపురం
బి. కిరణ్ మోహన్‌రావు	అనంతపురం	చెన్నూరు
సయ్యద్‌వున్నీసా	కర్నూలు	జమ్మలమడుగు
ఎ. వీరకిశోర్	తూర్పుగోదావరి	చాపాడు
పి. ఎం. కుల్లాయ్‌బాబు	చిత్తూరు	చింతకొమ్మదిన్నె
ఎస్. సుధాకర్‌రెడ్డి	చిత్తూరు	టి. సుండుపల్లి
బి. రాజశేఖర్‌రెడ్డి	చిత్తూరు	చక్రాయపేట
ఎం. రామనాథరెడ్డి	చిత్తూరు	గోపవరం

పశువైద్యం... అందని దైన్యం!

మరమ్మతులకు గురవుతున్న సంచార వాహనాలు

కనీస మందులు అందక పశుపోషకులకు అవస్థలు

– న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

గత వైకాపా ప్రభుత్వ పాలనలో అయిదేళ్ల పాటు పశువైద్యం పడకేసింది. పశువులకు అవసరమైన మందుల సరఫరా సక్రమంగా జరగలేదు. దాణా పంపిణీ అసలే లేదు. పశుబీమా పథకాన్ని అమలు చేయలేదు. ఫలితంగా పాడి రైతులు విలవిలలాడిపోయారు. ఇది చాలదన్నట్లు గ్రామాల్లో పశువులకు మెరుగైన వైద్యసేవలందిస్తామంటూ రూ.కోట్లు వెచ్చించి సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి వాహనంలో పశువైద్యుడు, పశువైద్య సహాయకుడు, అటెండర్ ఉంటారు. వాహనాల్లో ప్రతి రోజు ఉదయాన్నే గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్య సేవలు అందించాల్సి ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదు.

● జిల్లాలో మొత్తం 13 సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలున్నాయి. వాహనానికి ముగ్గురు సిబ్బంది చొప్పున మొత్తం 39 మంది పని చేస్తున్నారు. వాహనాలను 'ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్రీన్ హెల్త్ సొసైటీ' ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి. ప్రభుత్వం ఒక్కో వాహనానికి సిబ్బంది జీతాలతో కలిపి నెలకు రూ.లక్షల్లో చెల్లిస్తోంది. వీటి ద్వారా సక్రమంగా పశు వైద్యసేవలందడం లేదు. వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతుండటం, సరిపడా మందుల్లేకపోవడం, వాహనంలోని పరికరాలు మరమ్మతులకు గురవ్వడం తదితర కారణాలతో పశువులకు మెరుగైన వైద్యసేవలందడం లేదు. పలుమార్లు మరమ్మతులకు గురైనప్పుడు వారాల తరబడి నిలిచిపోతుండటంతో గ్రామాల్లో పశు వైద్య సేవలందడం లేదు. సిబ్బందికి మాత్రం మొత్తం జీతం చెల్లించాల్సి వస్తోంది. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పందించి జిల్లాలో పశువైద్య సేవలు మెరుగుపడేవిధంగా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సంచార పశు ఆరోగ్య సేవ వాహనం

జిల్లాలో పశు సంపద

ఆవులు	: 2.75 లక్షలు
గేదెలు	: 1.2 లక్షలు
గొర్రెలు	: 18.60 లక్షలు
మేకలు	: 3.50 లక్షలు
కోళ్లు	: 25 లక్షలు
పందులు	: 10 వేలు
జిల్లాలోని మొత్తం సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు	: 13
సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల్లో పని చేస్తున్న సిబ్బంది	: 39 మంది

స్థానికంగా ఉండని పశువైద్యులు : పశుసంవర్ధకశాఖలో పనిచేస్తున్న పశు వైద్యులు స్థానికంగా నివాసం ఉండకపోవడం, సమయపాలన పాటించకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో కూడా పశువైద్యులు అందుబాటులో ఉండకపోవడం వలన తమ కింద పనిచేసే సిబ్బందిని పంపిస్తుండటంతో వారికి ఏ జబ్బుకు ఎలాంటి వైద్యం చేయాలో అవగాహన లేకపోవడంతో పశువులకు మెరుగైన వైద్యసేవలందక మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాలతో సహా జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

మందులు అందుబాటులో ఉంచుతున్నాం

సంచార పశు వైద్య వాహనంలో అత్యవసర మందులు మాత్రమే అందుబాటులో ఉంటాయి. మిగిలిన అవసరమైన మందులు పాడి రైతులు స్థానిక పశువైద్య శాలల్లో తీసుకోవాల్సి ఉంటుంది. వాహనాలు మరమ్మతులకు గురైనప్పుడు వీలైనంత తొందరగా మరమ్మతులు చేయిస్తున్నాం. పాడిరైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- నరేష్, జిల్లా మేనేజరు, సంచార పశు ఆరోగ్య సేవ వాహన విభాగం

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. రాయచోటి మండలం యండపల్లికి చెందిన శంకరమ్మ (44) అనే మహిళ కడుపునొప్పి, రక్తహీనతతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లారు. వైద్యాధికారులు ఆమెను పరీక్షించి కడుపులో నాలుగు కిలోల గడ్డ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. మూడు లీటర్ల రక్తం ఎక్కించిన అనంతరం వైద్యాధికారులు రెడ్డిమహేశ్వర్‌రాజు, వెంకటశివ, అనిల్‌లు శస్త్ర చికిత్స చేసి రోగి కడుపు నుంచి గడ్డను వెలికి తీశారు.



రోగి కడుపులో నుంచి వెలికి తీసిన గడ్డ

పంటల సాగు శాతం పెంచాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే విధంగా వ్యవసాయ పంటల సాగు 15 శాతం పెంచే విధంగా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. జీవనోపాధుల కల్పన కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి రబీ సీజన్‌కు సన్నాహాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర్, ఏడీఏ శివశంకర్, డీఆర్సీ ఏడీఏ మజీద్ అహ్మద్, అశోక్‌రెడ్డి, వెంకటమోహన్, రమేశ్ రాజు, సుచిత్ర, మండల వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్నారి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో చిన్నారి హత్య ఘటనను ఖండించారు. అనంతరం మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. చిన్నారి ఆత్మకు శాంతి కలగాలని ఎమ్మెల్యే, మత పెద్దలు శుక్రవారం ప్రార్థనలు చేశారు. నిందితులను త్వరగా పట్టుకుని శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారిని హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. పుంగనూరులో జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రవిచారణ జరిపి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటుందని, దీనిపై పోలీసుశాఖ అధికారులతో మాట్లాడటం జరిగిందని, చిన్నారి తల్లిదండ్రులకు అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ముస్లిం మత గురువులు జలాలుద్దీన్, మతపెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



చిన్నారి ఆత్మశాంతికి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ముస్లింలు

8 నుంచి జిల్లాస్థాయి యోగాసన పోటీలు

రాయచోటి : జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఈ నెల 8వ తేదీన జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కూన కృష్ణదేవరాయలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాసాపేటలోని సాయిశుభ కల్యాణ మండపంలో నిర్వహించే పోటీలలో బాలికలు, బాలురు, మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా పోటీలు ఉంటాయన్నారు. 8-14, 14-18, 18-24, 24-30, 30-40 వయస్సుల వారికి వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడిస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు ఈ నెల 26వ తేదీ నంద్యాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9381405462, 7013238986, 9848366706 సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మహిళా సంఘాల్లోని సభ్యులకు రుణసాయం కల్పించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ పేర్కొన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో క్లస్టర్ సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. శ్రీ నిధి, బ్యాంకు లింకేజీ, ఉన్నతి రుణాలపై సమీక్షించారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ యాప్‌లో నమోదైన మహిళలకు రుణాలు కల్పించి, ఔత్సాహిక పారిశ్రామికులుగా తీర్చిదిద్దాలని, వారి కుటుంబం ఆర్థికంగా మెరుగుపడేలా అవగాహన కల్పించాలన్నారు. సంఘ సభ్యులకు వ్యక్తిగతంగా ఉపాధి పొందేందుకు రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రెండు శాతం వడ్డీ రాయితీతో రుణాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం ఉదయ్‌కుమార్, బ్యాంకు లింకేజీ డీపీఎం లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఐబీ డీపీఎం వేణుమాధవ్, మహిళామార్ట్ డీపీఎం రమణ, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, పక్కన అధికారులు

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణ అధికారిణి దేవశిరోమణి, భ్రూణ హత్యల నివారణ విభాగం జిల్లా నోడల్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. స్థానిక ఐఎంఏ భవనంలో శుక్రవారం జరిగిన ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు, ప్రైవేటు వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు డివిజన్‌లో ఉన్న స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ, అవగాహన కల్పించామన్నారు. నిబంధనల ప్రకారం స్కానింగ్ కేంద్రాలను నిర్వహించాలని, లింగ నిర్ధారణ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మదనపల్లెలో జరిగిన సమావేశానికి 50 మంది స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు హాజరు కావాల్సి ఉండగా 32 మంది మాత్రమే హాజరయ్యారు. సమావేశానికి హాజరు కాని వారికి నోటీసులిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, రాజగోపాల్, మదనపల్లె డివిజన్‌లోని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణ అధికారిణి దేవశిరోమణి

రైతులతో మమేకం కావాలి

కలికిరిగ్రామీణ, న్యూస్‌టుడే : క్షేత్రస్థాయిలో పంటలను సందర్శించి రైతులతో మమేకమై గ్రామీణ పరిస్థితులను అవగతం చేసుకోవాలని కేవీకే సమన్వయకర్త కె.మంజుల విద్యార్థులకు సూచించారు. మహానంది వ్యవసాయ కళాశాల నాలుగో ఏడాది విద్యార్థులు జిల్లాలోని గ్రామీణ పరిస్థితుల అవగాహన నిమిత్తం శుక్రవారం కలికిరి కేవీకేకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కేవీకే ఆవిర్భావం, విధులు, జిల్లాలోని ప్రధాన పంటల సాగు, నూతన వ్యవసాయ పద్ధతులు, పశుసంపద తదితర అంశాలపై విద్యార్థులకు తెలియజేశారు. మూడు మాసాల శిక్షణ కాలంలో కేవీకే శాస్త్రవేత్తలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ పంటల్లో నెలకొన్న లోటుపాట్లను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహానంది కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పవన్‌కుమార్‌రెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



వ్యవసాయ విద్యార్థులకు సూచనలిస్తున్న కేవీకే సమన్వయకర్త మంజుల

మైక్రో ఇరిగేషన్‌పై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు మైక్రో ఇరిగేషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా సూక్ష్మ నీటి పారుదల శాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మైక్రో ఇరిగేషన్ ఏర్పాటు, పని చేయువిధానం, సిస్టమ్ నిర్వహణలో పని తీరు మెరుగుపరుచుకునే విధానంపై ఔత్సాహికులపై వెయ్యి మంది నిరుద్యోగ యువకులను గుర్తించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్క రోజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ, క్షేత్ర స్థాయిలో శిక్షణ నిర్వహించి మైక్రో ఇరిగేషన్ కంపెనీలు, డీలర్ల వద్ద కాంట్రాక్టు పొందుట, స్వయం ఉపాధి మైక్రో ఇరిగేషన్ రైతులకు సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన యువత పది, ఇంటర్, ఐటీఐ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు వివరాలతో రాజంపేట రోడ్డులోని జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

అంగన్‌వాడీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ పాలనలో అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనల్లో భాగంగా అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ... అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యూనియన్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

పుల్లంపేట, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని మధులత ఎంపికైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద, పీడీ నీలకంఠేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనుపరచి బాలికా జట్టులో స్థానం సంపాదించినట్లు వారు తెలిపారు. త్వరలో మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వారు వివరించారు.



మధులత

మారుమూల గ్రామాలకు టెలికం డిజిటల్ సేవలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: దేశంలో మారుమూల గ్రామాలకు టెలికాం డిజిటల్ సేవలను శరవేగంగా విస్తరిస్తున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ శాఖ డిజిటల్ భారత్ నిధి డైరెక్టర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలో కోనరాజుపల్లెలో బీఎస్ఎన్ఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ టవరును శుక్రవారం పరిశీలించారు. రాచగుడిపల్లె గ్రామ సచివాలయంలో ఏపీ ఫైబర్ నెట్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న పదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 26 వేల అధునాతన సెల్ టవర్లు ఏర్పాటు చేయడానికి రూ.30 వేల కోట్లు కావాలని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసినట్లు వివరించారు. ఇప్పటికీ ఎలాంటి నెట్‌వర్క్ లేని పల్లెలను గుర్తించి ప్రాధాన్య క్రమంలో టవర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో కొత్తగా 45 చోట్ల సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా అధికారులు తెలిపారు. కోనరాజుపల్లెలో టవరు ఏర్పాటు చేసినా ఇంకా అన్ని మొబైల్ ఫోన్లకు నెట్‌వర్క్ రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచి శేఖర్‌రెడ్డి, బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీ మల్లికార్జునరెడ్డి, ఏపీఎస్ఎఫ్ఎల్ ఏజీఎం వెంకట్రావు, కడప ఆర్ఎం దివాకర్‌రెడ్డి, మార్కెటింగ్, నెట్‌వర్క్ మేనేజర్లు రేవంత్‌రెడ్డి, నాగభూషణం, కొండయ్య పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిజిటల్ భారత్ నిధి డైరెక్టర్ సతీష్‌కుమార్

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి చెందినట్లు బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి తెలిపారు. మదనపల్లె మండలం బాలాజీనగర్‌కు చెందిన చాంద్‌బాషా (22) పది రోజుల క్రితం కదిరికి వెళ్లి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా కాండ్లమడుగుక్రాస్ వద్ద ఆటో ఢీకొంది. ప్రమాదంలో చాంద్‌బాషాతో పాటు ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. వారిని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చాంద్‌బాషా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి శుక్రవారం తిరుపతికి తీసుకువస్తుండగా మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం... స్మగ్లర్లు పరారు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం బీటు అటవీ ప్రాంతంలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీక్షేత్రాధికారిణి కళావతి మాట్లాడుతూ సిద్దవటం బీటు అటవీ ప్రాంతంలో రోజువారి పరిశీలనలో భాగంగా శుక్రవారం అటవీ సిబ్బంది తనిఖీలు చేపట్టామన్నారు. ఎద్దుల గుండాల అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కనిపించగా, తాము అక్కడకి వెళ్లగానే వారు పరారయ్యారని చెప్పారు. ఘటనా స్థలంలో 13 ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయని, వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని చెప్పారు. ఉప అటవీక్షేత్రాధికారి ఓబులేసు, బీటు అధికారి పెంచలరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



దుంగలు స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

అన్నమయ్య డీఎఫ్‌వో వివేక్ బదిలీ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప డీఎఫ్‌వో పి.వి.సందీప్‌రెడ్డి పాడేరుకు బదిలీ అయ్యారు. అనంతపురం డీఎఫ్‌వోగా పనిచేస్తున్న వినీత్‌కుమార్ కడపకు రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అలాగే అన్నమయ్య డీఎఫ్‌వోగా పనిచేస్తున్న వివేక్‌ను తిరుపతికు బదిలీ చేశారు. అనకాపల్లిలో పనిచేస్తున్న జగన్నాథ్‌సింగ్ అన్నమయ్య జిల్లాకు రానున్నారు. కర్నూలు కన్జర్వేటర్‌గా పనిచేస్తున్న రామకృష్ణను ఏపీ బయోడైవర్సిటీ సభ్యకార్యదర్శిగా బదిలీ చేశారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

త్వరితగతిన గృహనిర్మాణాలు పూర్తి చేయండి

పెద్దతిప్పసముద్రం గ్రామీణ, న్యూస్‌టుడే : అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఈ ఏడాది ఆఖరిలోపు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి శివయ్య అన్నారు. పీటీఎం మండల గృహ నిర్మాణ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది ఒక్కరే ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అంకిరెడ్డిపల్లి రోడ్డులోని కాలనీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాసులు ఉన్నారు.


పీటీఎం కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ పీడీ శివయ్య

టెట్ పరీక్ష కేంద్రం పరిశీలన

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర 2047కు మిట్స్ విద్యా సంస్థ ద్వారా విద్యార్థుల నుంచి అభిప్రాయాలను సేకరించి, వారు అందజేసిన సూచనలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు కృషి చేస్తామని మిట్స్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్‌చౌదరి తెలిపారు. టెట్ పరీక్ష కేంద్రాన్ని మిట్స్‌లో ఏర్పాటు చేసిన సందర్భంగా పరీక్ష తీరు పరిశీలించేందుకు డీవైఈవో పురుషోత్తం, ఎంఈవో ద్వారకనాథ్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. ఇందులో భాగంగా కళాశాల కరస్పాండెంట్‌తో విద్యాశాఖాధికారులు సమావేశమయ్యారు.


విజయభాస్కర్‌చౌదరితో మాట్లాడుతున్న డీవైఈవో పురుషోత్తం, ఎంఈవో ద్వారకనాథ్

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

?: మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీలో వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో అంధకారం నెలకొంది. - వెంకటరమణ, కోళ్లబైలు
✔: క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేయించి వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. - ఆనంద్‌రెడ్డి, సర్పంచి, కోళ్లబైలు

?: మండలంలోని కొత్తిండ్లు పంచాయతీ రంగారెడ్డికాలనీలో ఇళ్ల మధ్య చెత్త, గడ్డి పేరుకుపోయింది. కాలువల్లో గడ్డి అడ్డుపడి మురుగు ప్రవహించడం లేదు. - బావాజాన్, రంగారెడ్డి కాలనీ
✔: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. - ఆనంద్, సచివాలయ కార్యదర్శి, కొత్తిండ్లు

?: పట్టణ, సరిహద్దు ప్రాంతమైన కొత్తిండ్లు వద్ద చెత్తచెదారం గుట్టగా ఏర్పడి దోమలకు నిలయంగా మారింది. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో చెత్తకు నిప్పంటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. - రంగనాథం, కొత్తిండ్లు
✔: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - ఆసియాబేగం, సర్పంచి, కొత్తిండ్లు

?: ఎన్‌వీఆర్ విస్తరణ ప్రాంతంలో రోడ్డుపై చెత్తచెదారం పేరుకుపోయింది. దుర్వాసన వస్తుంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - బాబా, ఎన్‌వీఆర్ వీధి, మదనపల్లె
✔: చెత్తడిబ్బలు లేకుండా పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - ప్రమీల, పుర కమిషనర్, - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: రామసముద్రం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో చెట్టు ఊతం కోసం ఏర్పాటు చేసిన కుండీలో చెత్తను నింపేశారు. చెత్తను తొలగించి కుండీలో మట్టిని నింపి చెట్టు ఎదుగుదలకు చర్యలు చేపట్టాలి. - శ్రీనివాసులు, రామసముద్రం
✔: కుండీలో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుని, మట్టిని నింపి చెట్టు ఎదుగుదలకు కృషి చేస్తాం. - సుధాకర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ, రామసముద్రం

?: రామసముద్రం-చెంబకూరు ప్రధాన రహదారిలో కాప్పల్లె వద్ద గ్రామం పేరును సూచించే బోర్డు ఏపుగా పెరిగిన చెట్టు కొమ్మల మధ్య ఇరుక్కుపోయింది. చెట్టుకొమ్మలను తొలగించి బోర్డు కనబడేలా చర్యలు తీసుకోవాలి. - రాజప్ప, గ్రామస్థుడు
✔: చెట్టు కొమ్మలను తొలగించి బోర్డును ప్రయాణికులకు కనిపించేలా చర్యలు తీసుకుంటాం. - బుర్రయ్య, ఏఈ ఆర్‌అండ్‌బీ. మదనపల్లె, - న్యూస్‌టుడే, రామసముద్రం

పంచాయతీ రోడ్లు... ప్రమాదాలకు నిలయాలు

• ముళ్లపొదలు పెరిగిపోవడంతో ప్రయాణికుల బెంబేలు • పట్టించుకోని పంచాయతీ అధికారులు

మదనపల్లె నేరవార్తలు, గ్రామీణ, న్యూస్‌టుడే : పంచాయతీ, గ్రామీణ రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. సాధారణంగా జాతీయ రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రస్తుతం వీటిలో తగ్గుముఖం పట్టి పంచాయతీల్లోని గ్రామీణ రహదారులపై ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నాయి. మదనపల్లె మండలంలోని పలు మార్గాలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు పెరిగిపోయి రహదారి కన్పించకుండా పోతున్నాయి. పంచాయతీకి పన్నుల ద్వారా నిధులు వస్తున్నా రహదారుల నిర్వహణ మాత్రం గాలికి వదిలేశారు. దీంతో ప్రజలు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగిపోవడంతో ఇటీవల రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఓ యువతి ఉందగా మరో నెలలో వివాహం జరగాల్సి ఉంది. దీంతో ఆ యువతి ఆసుపత్రి పాలు కావాల్సి వచ్చింది.


అంకిశెట్టిపల్లె మార్గంలో రోడ్డు పక్కన పెరిగిన ముళ్లపొదలు

అధ్వానంగా ఉన్న రహదారులు ఇవే...

మదనపల్లె మండలంలోని అంకిశెట్టిపల్లె ఇసుకనూతిపల్లె మధ్య కొండామారిపల్లెకు వెళ్లే మార్గం, చెంబకూరు రోడ్డులో నుంచి టేపులపాళెం, బైపాస్ రోడ్డు నుంచి బెస్తపల్లెకు వెళ్లే దారి, మదనపల్లె నుంచి కోళ్లబైలు, పుంగనూరు రోడ్డులో నుంచి బండకాడపల్లె, బొమ్మనచెరువు నుంచి బొగ్గిటివారిపల్లె, కోటకొండపల్లెకు వెళ్లే మార్గాలు అధ్వానంగా ఉండగా రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డుపైకి వచ్చేశాయి. మలుపుల్లో ఎదురుగా వచ్చే వ్యక్తులు గానీ, వాహనాలు గానీ కన్పించడం లేదు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

పిచ్చిమొక్కలు తొలగిస్తాం

మదనపల్లె మండలంలో ఉన్న గ్రామీణ రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి, ముళ్ల కంపలను తొలగించేలా సంబంధిత పంచాయతీ సిబ్బందికి సూచనలు చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లోని పారిశుద్ధ్య కార్మికులతో ఈ పనులు చేయించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు తెలియజేస్తాం. సాధ్యమైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేయించి ప్రమాదాలు నివారించేలా చర్యలు తీసుకుంటాం.
- శ్రీహరి, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, మదనపల్లె

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని మదనపల్లె ఏబీవీపీ నాయకులు డిమాండు చేశారు. మదనపల్లెలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం తరగతులు నిర్వహిస్తుండగా వారు అడ్డుకున్నారు. విద్యార్థులు చదువు ఒత్తిడి నుంచి బయట పడేందుకు ప్రభుత్వం సెలవులు ప్రకటిస్తే ర్యాంకుల కోసం విద్యాసంస్థలు పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీవీపీ పాఠశాలల రాష్ట్ర కన్వీనర్ సాయిహితేష్, నగర కార్యదర్శి కిశోర్, సంయుక్త కార్యదర్శి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని రెడ్డివారిపల్లె, కొండయ్యగారిపల్లె, ముష్టూరు పంచాయతీల్లో జరుగుతున్న వాటర్‌షెడ్ పనులను జేఈ విశ్వనాథ్, సాంకేతిక అధికారి ధర్మేంద్ర పరిశీలించారు. వాటర్‌షెడ్ పనులకు రూ.43 లక్షలు మంజూరుకాగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనుల్లో నాణ్యతను పరిశీలిస్తున్నామని, కొత్తగా నిధులు వచ్చిన వెంటనే రైతులకు అవసరమయ్యేలా పనులు చేపడతామన్నారు.

ఫ్రీ హోల్డ్ దరఖాస్తులు పరిష్కరించండి

పీలేరు, న్యూస్‌టుడే : మండలంలో ఉన్న ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను పూర్తిగా పరిష్కరిస్తేనే బదిలీ అయిన వీఆర్వోలకు రిలీవ్ చేస్తానని పీలేరు తహసీల్దార్ భీమేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఫ్రీ హోల్డ్ భూములకు వచ్చిన దరఖాస్తుల విషయంలో జిల్లా అధికారులు సత్వరం పరిష్కరించాలని ఆదేశించినందున అందుకు అనుగుణంగా వీఆర్వోలు వేగంగా దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీటీలు సుబ్రహ్మణ్యం, రెడ్డెప్పరెడ్డి, ఆర్ఐ చాణక్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసుపై విచారణ

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు పట్టణం బండ్లవంక ప్రాంతంలో గత నెల 18న నమోదైన ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసుపై శుక్రవారం రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ విచారణ చేపట్టారు. ఇదే ప్రాంతంలో లీలావతి తన ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటుండగా పక్కనే నివాసముంటున్న రవి, నాగరత్న కులం పేరుతో తిట్టారని పీలేరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు విచారించి నివేదికను ఎస్పీ విద్యాసాగర్ నాయుడికి అందజేస్తామని డీఎస్పీ తెలిపారు. సీఐ యుగంధర్, ఎస్సై బాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, ములకలచెరువు, న్యూస్‌టుడే : ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన శుక్రవారం తంబళ్లపల్లెలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లికు చెందిన ఫకృద్దీన్, షబానా దంపతులు ఎద్దులవారిపల్లి వద్ద వ్యవసాయం చేస్తున్నారు. రామాపురానికి చెందిన వినోద్ తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో జీడీఏ(జనరల్ డ్యూటీ అటెండర్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఫకృద్దీన్, షబానా దంపతులు ఎద్దులవారిపల్లి వద్ద వ్యవసాయ పనులు ముగించుకొని వారి ఆటోలో ఇంటికి వెళ్తుండగా అదే సమయంలో వినోద్ సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో వస్తుండగా మూలపల్లి సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో వినోద్, ఫకృద్దీన్‌కు తీవ్ర గాయాలు కాగా షబానా స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తంబళ్లపల్లె ఆసుపత్రికి తీసుకెళ్లగా, వినోద్ మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మదనపల్లె ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా **గురుస్వామి** శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ రాజును పీలేరుకు బదిలీ చేశారు. రాయచోటి ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గురుస్వామిని ఇక్కడికి వచ్చారు.

డీటీగా అస్లాంబాషా : మదనపల్లె డీటీగా అస్లాంబాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న బాబ్‌జాన్ గుర్రంకొండకు బదిలీపై వెళ్లారు.

ఎఫ్ఏసీ ఎంపీడీవోగా మస్తాన్‌వల్లి : మదనపల్లె మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న మస్తాన్‌వల్లిని ఎఫ్ఏసీ ఎంపీడీవోగా నియమించడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న భాను ప్రసాద్ రామసముద్రం మండల ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. దీంతో మస్తాన్‌వల్లిని నియమిస్తూ ఉమ్మడి చిత్తూరు జిల్లా సీఈవో ఆదేశాలు జారీ చేశారు.

కురుబలకోట ఎంపీడీవోగా గంగయ్య : కురబలకోట: కురుబలకోట ఎంపీపీగా గంగయ్య శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కలికిరి నుంచి ఇక్కడికి బదిలీ కాగా, ఇక్కడి పనిచేస్తున్న హరినారాయణ ములకలచెరువుకు బదిలీ అయ్యారు.

విద్యుత్తుశాఖ ఏఈగా నాగరాజ: నిమ్మనపల్లె: నిమ్మనపల్లె విద్యుత్తుశాఖ ఏఈగా నాగరాజ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కురబలకోట ఏఈగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ వసంతకుమార్‌రెడ్డి మదనపల్లెకు వెళ్లారు. విద్యుత్తు శాఖలో సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపుతానని నాగరాజ పేర్కొన్నారు.

శాప్ ఛైర్మన్‌కు అభినందనలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్‌గా ఎంపికైన రవినాయుడుకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రవినాయుడుకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.


శాప్ ఛైర్మన్ రవినాయుడిని సత్కరిస్తున్న తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు

అంగళ్లులో క్రీడామైదానం ఏర్పాటుకు వినతి

కురబలకోట : మండలంలోని అంగళ్లు కూడలిలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అయూబ్‌బాషా కోరారు. ఈ మేరకు శాప్ ఛైర్మన్ రవినాయుడిని విజయవాడలో కలిశారు. శాప్ ఛైర్మన్‌గా ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెదేపా నాయకులు ఆయన్ను కలిసి సన్మానించారు.

బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపిక

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే : జేఎన్‌టీయూసీలో జరిగే క్రీడా పోటీలకు మిట్స్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. డేటా సైన్స్‌కు చెందిన జీవన్, సీఎస్ఈకి చెందిన నిహిత కృష్ణ, లక్ష్మీతనూజ, పి.వైష్ణవి బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు

దసరా నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.
- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం


గండబోయనపల్లెలో గాయత్రీ దేవి అలంకరణలో సత్యమ్మ


బాలత్రిపురసుందరీ దేవిగా చెర్లోపల్లె రెడ్డెమ్మదేవత


కుంకుమ అలంకరణలో కోర్టులో గంగమ్మ


కలకడ: కోనలో గాయత్రీదేవి అలంకరణలో చౌడేశ్వరీదేవి


బి.కొత్తకోట ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


మట్లవారిపల్లెలో పూజలందుకుంటున్న గంగమ్మ


గర్నిమిట్టలో అలంకరణలో కనకదుర్గమ్మ


చక్కెరవాండ్లపల్లెలో వెంకటేశ్వరస్వామి


కలికిరి సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అరకొర నీరు... సాగుకు ఇక్కట్లు!

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: అన్నదాతకు కల్పతరువులాంటి బాహుదా జలాశయంలో నీరు క్రమంగా తగ్గిపోతోంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో బాహుదాలో నీరు తగ్గుముఖం పడుతోంది. మండలంలో సాధారణ వరి సాగు 486 హెక్టార్లు కాగా అంతకు మించి రైతులు గణనీయంగా 502 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. వరి ధాన్యానికి తగ్గ గిట్టుబాటు ధరలు ఉండడంతో ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది. బాహుదా జలాశయం 0.04 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. వరుణుడు కరుణించకపోవడంతో జలాశయంలో 20 శాతం జలం మాత్రమే ఉంది. వరిసాగు దిగుబడులు రావడానికి ఇంకా రెండు నెలల సమయం ఉంది. ఈలోగా వర్షాలు కురవకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. కొంతమంది వరి సాగుకు ప్రత్యామ్నాయంగా బోర్లు ఉండడంతో ఆ నీటితో పంటలను దక్కించుకునే పరిస్థితి ఉంది. బాహుదా కింద వరితో పాటు వంగ, బెండ, టమాట, మిరప వంటి పంటలు సాగయ్యాయి. వ్యవసాయ బోర్లులేని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు.


నిమ్మనపల్లె బాహుదా జలాశయంలో అడుగంటిన నీరు

రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత లేదు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : అధికారం చేపట్టగానే జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వేషం, భాష మారిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పీలేరులో మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉంటూ ఒక మతానికి చెందిన వేషాన్ని ధరించి, ఆ మతమే గొప్పదని మాట్లాడడం ఇతర మతాలకు అభద్రత భావం కలిగించడమేనని ఆరోపించారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం పాటిస్తూ వేల కి.మీ పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత పవన్ కల్యాణ్‌కు లేదన్నారు.

తపాలాశాఖ వారోత్సవాలు 7 నుంచి

పీలేరు, న్యూస్‌టుడే : ఈ నెల ఏడో తేది నుంచి పదకొండో తేదీ వరకు తపాలాశాఖ జాతీయ వారోత్సవాలు జరుగుతాయని పీలేరు తపాలాశాఖ అధికారి జి.వినోద్‌కుమార్ తెలిపారు. వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తామని వినోద్‌కుమార్ వివరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మనస్తాపంతో వ్యక్తి పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. మండలంలోని పోతబోలు గ్రామానికి చెందిన మహబూబ్ బాషా వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో కొంత అప్పు చేశారు. వ్యాపారం సక్రమంగా జరగకపోవడంతో చేసిన అప్పు చెల్లించలేకపోయారు. దీంతో అప్పులు ఇచ్చిన వారి నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో ఇంట్లోనే పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు అయన్ను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : జూదం ఆడుతున్న ఏడుగురిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు మదనపల్లె ఒకటోపట్టణ సీఐ చాంద్‌బాషా తెలిపారు. నీరుగట్టువారిపల్లెలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ కొండయ్యనాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ అన్సర్‌బాషా, సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.23వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

నిందితులను శిక్షించాలని డిమాండు

కలకడ, న్యూస్‌టుడే : పుంగనూరులో అదృశ్యమై హత్యకు గురైన చిన్నారి ఆత్మకు శాంతి కలగాలని మండల కేంద్రమైన కలకడలో శుక్రవారం రాత్రి ముస్లింలు శాంతిర్యాలీ నిర్వహించారు. స్థానిక బిలాల్ మసీదు నుంచి ఆర్టీసీ బస్టాండ్ కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. నిందితులను శిక్షించాలని డిమాండు చేశారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

మహల్(కలికిరి): చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో ఏడేళ్ల బాలిక అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ముస్లిం సోదరులు, మతపెద్దలు డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి కలికిరి మండలం మహల్ గ్రామంలో ముస్లిం సోదరులు కొత్తపల్లె నుంచి మహల్ కూరాకులపల్లె వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.

రామసముద్రంలో శాంతి ర్యాలీ

రామసముద్రం : రామసముద్రంలో కుల మతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు శుక్రవారం రాత్రి శాంతి ర్యాలీ చేపట్టారు. దిగువపేట నుంచి చెక్‌పోస్టు మీదగా పోలీసుస్టేషన్ వరకు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. పుంగనూరులో హత్యకు గురైన చిన్నారికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.


కలకడలో కొవ్వొత్తులతో ముస్లింల ర్యాలీ


మహల్‌లో నిరసన తెలుపుతున్న స్థానికులు

తగ్గిన వేరుసెనగ దిగుబడులు... రైతులకు కన్నీరు


వేరుసెనగ పంటను తొలగిస్తున్న కూలీలు

ములకలచెరువు న్యూస్‌టుడే : వర్షాభావంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో సాగు చేసిన వేరుసెనగ దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుసెనగ పంట తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పెట్టుబడి వ్యయం వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. సరైన సమయంలో వర్షం కురవకపోవడంతో కొన్నిచోట్ల పంట ఎండుముఖం పట్టింది. మరికొన్ని చోట్ల అరకొరగా దిగుబడులు చేతికందుతున్నాయి. పంట నూర్పిడికి ట్రాక్టరుతో దున్నడం, ట్యాంకర్లతో నీటి తడులు ఇవ్వడానికి ఖర్చు అవుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది రైతులు వేరుసెనగ పంట తొలగిస్తే పశువులకు మేతగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

● తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో 15వేల ఎకరాల్లో వేరుసెనగ పంట సాగైంది. పెట్టుబడి ఖర్చులు పెరగడం, అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వన్యప్రాణుల బెడదతో రైతులు ఇప్పటికే అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు వర్షాభావ పరిస్థితులతో దిగుబడులు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లె మండలాల్లోని రైతులు కొండల ప్రాంతాల్లో పంటలు సాగు చేయడంతో రాత్రి వేళల్లో వన్యప్రాణులతో సాగు చేసిన అరకొర పంటను కూడా నష్టపోయే పరిస్థితులున్నాయి.

పెట్టుబడి వ్యయం రాలేదు



మాది ములకలచెరువు మండలం, గాలేటివారిపల్లి. ఒకటిన్నర ఎకరాల్లో వేరుసెనగ పంట సాగు చేశాను. వర్షాభావంతో పంట దిగుబడి అరకొరగా వచ్చింది. వేరుసెనగ కాయల నాణ్యత తగ్గింది. దీంతో ఒకటిన్నర ఎకరాల్లో నాలుగు బస్తాల దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి వ్యయం కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో నష్టం వస్తుంది. వర్షం సక్రమంగా వచ్చి ఉంటే ఎకరానికి 20 బస్తాలు పైగా వచ్చేవి. - రాధమ్మ, గాలేటివారిపల్లి, ములకలచెరువు మండలం

తైక్వాండో పోటీలు నేడు


మాట్లాడుతున్న జిల్లా క్రీడల కార్యదర్శి శారద

రైల్వేకోడూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభించినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ క్రీడల కార్యదర్శి శారద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 11 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారన్నారు. రాష్ట్ర రెఫరీ రవిశంకరరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

పరిసరాల శుభ్రత తప్పనిసరి

రాజంపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛమైన ప్రకృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏఐటీఎస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. స్వభావ స్వచ్ఛత సంస్కారంలో భాగంగా ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుక్రవారం మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మట్టిదిబ్బల తొలగింపు, చెత్త చెదారం తొలగింపు పనులు చేపట్టారు. మొక్కలు నాటి పెంచి కాపాడుతామని విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వై.ప్రదీప్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం పరిమళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠశాలలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న ఏఐటీఎస్ ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట: 9441872651
రాయచోటి: 9703622242
రైల్వేకోడూరు: 7981695235

గాలివీడు, న్యూస్‌టుడే

?: గాలివీడు-కదిరి ప్రధాన మార్గంలో పీహెచ్‌సీ, సచివాలయం-2, ఎమ్మార్సీ, సింగిల్ విండో కార్యాలయాలకు వెళ్లే దారిలో వీధి దీపాలు పని చేయడం లేదు. మలుపు వద్ద విద్యుత్తు స్తంభానికి ఏర్పాటు చేసిన దీపం కాలిపోయింది. నెల రోజుల నుంచి అంధకారం నెలకొంది. **- శ్రీనివాసులు, స్థానికుడు**

✓: స్థానికులు ఇబ్బంది పడకుండా విద్యుత్తు స్తంభానికి దీపం ఏర్పాటు చేస్తాం. **- సురేష్‌కుమార్, గాలివీడు పంచాయతీ కార్యదర్శి**

?: గాలివీడు బస్టాండ్ వద్ద మురుగు నీటి కాలువ ధ్వంసమైంది. వర్షం కురిస్తే కాలువ నుంచి నీరు పొంగి రహదారిపై ప్రవహిస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- రమణయ్య, స్థానికుడు**

✓: ప్రధాన రహదారి మురుగు కాలువ పగలకొట్టారు. మురుగు నీరు రోడ్డుపై పారడం కాకుండా మరమ్మతులు చేయిస్తాం. **- సురేష్‌కుమార్, గాలివీడు పంచాయతీ కార్యదర్శి**

?: అరవీటి పంచాయతీ కార్యాలయానికెళ్లే దారిలో కాలువ వ్యర్థ నీరు దారిపై ప్రవహిస్తోంది. నీటి నిల్వతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మురుగు నీటిని మళ్లించాలి. **- శ్రీనివాసులు, స్థానికుడు**

✓: పంచాయతీ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పర్యటిస్తాం. మురుగు నీటి నిల్వలు లేకుండా చేయిస్తాం. **- శేఖర్‌నాయక్, ఈవోపీఆర్డీ, గాలివీడు**

✓: రాజంపేట మండలం పోలిలో స్థానికులు మురుగు నీటిని వీధుల్లోకి వదులుతున్నారు. ఈ సమస్యపై మేమున్నాం మీకు తోడుగాలో శుక్రవారం చిత్ర కథనం ప్రచురితమైంది. దీంతో ఈవోపీఆర్డీ హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు స్పందించి గ్రామస్థులకు పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు నీరు బయటకు వదిలితే వచ్చే రోగాలపై అవగాహన కల్పించారు. బ్లీచింగ్ చల్లించారు. **- రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే**

?: రాయచోటి కొత్తపేటలోని ప్రభాకరసేన్ వద్ద మురుగు కాలువలో చెత్త చెదారం పేరుకుపోయింది. మురుగు నిరంతరం నిల్వ చేరి రోడ్డుపై పారుతోంది. **- వెంకట్రమణయ్య, కొత్తపేట**

✓: మురుగు కాలువను పరిశీలించి పారిశుద్ధ్య కార్మికుల ద్వారా వెంటనే చెత్తాచెదారం తొలగించేస్తాం. మురుగు నిరంతరం దిగువకు పారేలా చర్యలు తీసుకుంటాం. **- వాసుబాబు, పురపాలక కమిషనర్, రాయచోటి**

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే

?: రాయచోటి పురపాలక పరిధిలో గాలివీడు రోడ్డు మార్గంలో వెలిగల్లు నుంచి నీటిని సరఫరా చేసే పైపులైన్ పగిలి నీరు మొత్తం రోడ్డుపై పారుతూ.. వృథాగా పోతోంది. అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేసి, నీటి వృథా అరికట్టాలి. **- గోవిందు, స్థానికుడు**

✓: వెంటనే సిబ్బందిని పంపి పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తాం. నీటి వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. **- వాసుబాబు, కమిషనర్, రాయచోటి**

కూడళ్లలో కబ్జాలు... తొలగని కష్టాలు

తాఖీదులు ఇచ్చినా ఆగని ఆక్రమణల జోరు ● ట్రాఫిక్‌తో స్తంభిస్తున్న రవాణా


గాలివీడు నాలుగు రోడ్ల కూడలి ప్రాంతం


గాలివీడు బస్టాండులో జనం రద్దీ

గాలివీడు, న్యూస్‌టుడే: రాయచోటి-కదిరి ప్రధాన మార్గంలోని గాలివీడులో నాలుగు వరుసల రహదారి పనులు పూర్తి చేశారు. అందులో భాగంగా కూడలి ఏర్పాటుకు బస్టాండు, గేటు (నాలుగురోడ్ల కూడలి) ప్రాంతాల వద్ద కబ్జాలు తొలగించి, అక్రమ కట్టడాలపై ఎర్ర మార్క్ గుర్తులు ఇచ్చారు.. అందుకోసం గేటు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను మూడో వంతు తొలగించారు.

● లక్కిరెడ్డిపల్లె, మదనపల్లె, రాయచోటి, మదనపల్లె మార్గాల్లో మరి కొందరు ఆక్రమణలు తొలగించకుండా రాజకీయ వ్యవహారం నడిపారు. ప్రభుత్వ స్థలాలను ఖాళీ చేయాలని ఆక్రమదారులకు రెవెన్యూ అధికారులు తాఖీదులు జారీ చేసినప్పటికీ ఫలితం లేదు. బస్టాండ్ వద్ద పెద్దూరు, అరవీటివాండ్లపల్లె రోడ్లలోని అక్రమ కట్టడాలు తొలగించలేదు. ఆర్థిక, రాజకీయ ఒత్తిళ్లలో సర్వే పనులకే పరిమితమయ్యాయి. ఈ రెండు ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు నెలకొన్నాయి. ఖాళీ జాగాకు వ్యాపారులు అద్దె చెల్లిస్తున్నారు. అలాంటి స్థలం వదులుకోవడానికి ఆక్రమదారులు ఇష్టపడటం లేదు. ఈ వ్యవహారం రెండేళ్లు సాగుతోంది. శాసన సభ ఎన్నికలు రావడంతో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమైయ్యారు. దీంతో మళ్లీ ఆక్రమణలు మొదటికి వచ్చాయి. తొలగించిన అక్రమ కట్టడాలను మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా నిర్మించుకున్నారు. యధావిధిగా వ్యాపారాలకు అద్దెకు ఇచ్చారు. కూడలి నిర్మాణాలు అటకెక్కాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

● గేటు కూడలి వద్ద జరిగిన వాహన ప్రమాదంలో లోగడ వడిశల వంకపల్లెకు చెందిన ఓ రైతు మృత్యువాత పడ్డారు. ఓ మహిళ ఇంటి ముందు పరిసరాలు శుభ్రం చేస్తుండగా వాహనం ఢీకొని నవడలేని స్థితిలో చికిత్స పొందుతున్నారు. తరచూ వాహనాల ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఎక్కువగా ఉన్నాయి. గాలివీడు బస్టాండ్ వద్ద జరిగిన వాహన ప్రమాదంలో ఎగువపల్లెకు చెందిన ఒకరు మృతి చెందారు. ప్రమాదాలతో కాళ్లు పోగొట్టుకున్న సంఘటనలూ ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కూడలి ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించడానికి నిధులు మంజూరు చేసినప్పటికీ అడ్డంకులు తొలగించడంలో విఫలం కావడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.

● ఈ పనుల గురించి ఆర్‌అండ్‌బీ ఏఈఈ యూసూఫ్ మాట్లాడుతూ. . కూడలిలో నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గేట్ ప్రాంతానికి చెందిన ఆక్రమదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులిచ్చారు. ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగించలేదు. మళ్లీ తాఖీదులు ఇప్పిస్తాం. ఇటీవల ఉన్నతాధికారుల సమావేశంలో పనుల గురించి చర్చించామన్నారు.

చలో రాయచోటిని విజయవంతం చేయండి


గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

రాయచోటి, న్యూస్‌టుడే: హలో మాల.. చలో రాయచోటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకులు పేర్కొన్నారు. పొదలపల్లి దళితవాడలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేక పోస్టర్ కరపత్రాలు విడదల చేశారు. ఈ నెల 6వ తేదీన రాయచోటిలోని ఎన్జీవో హోంలో నిర్వహించ తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభను తొలిసారిగా ఏర్పాటు చేస్తున్నామని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించ తలపెట్టిన 'హలో మాల..చలో రాయచోటి' కార్యక్రమానికి విజయవంతం చేయాలన్నారు.

పిడుగుపాటుకు ఇల్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన ఇల్లు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో గురువారం రాత్రి పిడుగుపాటుతో ఇల్లు దగ్ధమైందని స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన సుబ్బరాయుడు తన వ్యవసాయ పొలంలో ఇల్లు నిర్మించుని అక్కడే నివాసం ఉండేవారు. మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పిడుగు పడటంతో ఇల్లు, నిత్యావసర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

శాప్ ఛైర్మన్‌ను కలిసిన మండల తెలుగు యువత అధ్యక్షుడు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: విజయవాడలో జరిగిన శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రమాణ స్వీకారానికి శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మండల తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాజంపేట పార్లమెంట్ యువత అధ్యక్షుడు తోపిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు.

అమ్మా భవానీ... శక్తిస్వరూపిణి


భవానీ దేవి అలంకరణలో దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి అమ్మవారు


వెంకట రాజంపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


పుల్లంపేటలో గాయత్రిదేవి అలంకరణలో మారెమ్మ


నందలూరులో గాయత్రి దేవిఅలంకారంలో...


ఉమామహేశ్వరాలయంలో భవానీదేవిగా అమ్మవారు

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఏకాంత పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్ల చిత్రాలివి.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం


రాజంపేటలో వాసవీమాతను దర్శించుకుంటున్న భక్తులు


తిప్పాయపల్లెలో గాయత్రిదేవి అలంకరణలో కొత్తపురి ఎల్లమ్మ

సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

రాయచోటి : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు మరచి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాయలసీమను అన్ని విధాలా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మున్సిపల్ ఛైర్మన్ ఎస్.ఫయాజ్‌బాషా, జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరెడ్డి, వైకాపా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బేపారి మహ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ హరున్‌బాషా పాల్గొన్నారు.

ఏపీఎంఎస్‌ఎంఈని కలిసిన యల్లటూరు

రాజంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ (ఏపీఎంఎస్‌ఎంఈ డీసీ) గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన టి.శివశంకర్‌రావును జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు శుక్రవారం విజయవాడలో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తమ ప్రాంతంలో చిన్న, మధ్యతరహా పరిశ్రలను ఏర్పాటు చేసేలా చూడాలని కోరినట్లు శ్రీనివాసరాజు తెలిపారు.

మహిళా పోలీసుకు కలెక్టర్ పరామర్శ

రాయచోటి, న్యూస్‌టుడే: పొలిమేరపల్లి గ్రామ సచివాలయంలో పని చేస్తూ పింఛన్లు పంపిణీ చేసేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తూ ప్రమాదానికి గురై గాయపడిన మహిళా పోలీసు వరలక్ష్మీని శుక్రవారం కలెక్టర్ శ్రీధర్ పరామర్శించారు. సుండుపల్లి ఎంపీడీవో ఇచ్చిన సమాచారంతో రాయచోటిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ అందజేశారు.

బీకేఎంయూ మండల కార్యదర్శిగా వెలుగు కృష్ణవేణి

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట మండల బీకేఎంయూ కార్యదర్శిగా వెలుగు కృష్ణవేణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి పండుగోల మణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణవేణి మాట్లాడుతూ పేదలకు బంజరు భూములు అందించే వరకు రాజీ లేని పోరాటం చేస్తానన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



పెనగలూరు, న్యూస్‌టుడే: పెనగలూరు ఎంపీడీవోగా **ఎస్.విజయారావు** శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఓబులవారిపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో వరప్రసాద్ రాజంపేటకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు, సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ రైల్వేకోడూరు పట్టణ ఏఈగా ఎస్.సుబ్రహ్మణ్యం శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన సింహాద్రిపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. రెవెన్యూ కార్యాలయంలో పట్టణ ఆర్ఐగా లక్ష్మీదేవి బాధ్యతలు చేపట్టారు. రాజంపేట నుంచి బదిలీపై ఆమెను ఇక్కడికి నియమించినట్లు చెప్పారు.

గొడుగురాయిని సంరక్షించాలని విన్నపం

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి-రాయవరం గ్రామాల సరిహద్దు ప్రాంతంలో పాలకొండలకు సమీపంలో గొడుగు ఆకారంలో ఉన్న ఓ రాయి చూపరులను ఆకట్టుకుంటోంది. దీన్ని విశ్రాంత సబ్ కలెక్టర్ రాజశేఖర్ శుక్రవారం సందర్శించారు. గొడుగురాయి పరిరక్షణకు పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

మురుగుతో సహవాసం



ఈ చిత్రంలో ఉన్న ప్రాంతం డ్రైనేజీ కాలువనో, లేక మురుగు కాలువనో అనుకుంటే పొరబడినట్లే. ఈ మురుగు కుంట రాజంపేట మండలం పోలీ ఎస్సీ కాలనీ వద్ద ఉంది. నివాసాల మధ్య మురిగిన నీటితో దుర్వాసన, దోమల కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే సమయం కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే విష జ్వరాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఈవోపీఆర్డీ హరిప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా వెంటనే మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

గిరిపుత్రులకు బంజరు భూములు పంపిణీ చేయాలి

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట మండలంలోని పేదలందరికి ప్రభుత్వ బంజరు భూములను గిరిపుత్రులకు పంపిణీ చేయాలని అన్నమయ్య బీకేఎంయూ జిల్లా కార్యదర్శులు పండుగోల మణి, తోపు కృష్ణప్ప డిమాండు చేశారు. పుల్లంపేట బైపాస్‌లో మండలంలోని బీకేఎంయూ కార్మికులతో శుక్రవారం వారు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ మండలంలో విస్తారంగా ప్రభుత్వ బంజరు భూములున్నాయని.. వాటిని పేదలకు పంచిపెడితే వారి కాళ్లపై వారు నిలబడి కుటుంబాలను పోషించుకోగలుగుతారన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కృష్ణయ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.


పుల్లంపేటలో నినాదాలు చేస్తున్న బీకేఎంయూ నాయకులు, కార్మికులు

అంతర్జాలంలో వివరాలు నమోదుపై అవగాహన


ఆన్‌లైన్ డేటా ఎంట్రీపై తెలుసుకుంటున్న ఆదర్శ పాఠశాల వృత్తివిద్యా కోర్సు విద్యార్థులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: అంతర్జాలంలో వివరాల నమోదుపై అవగాహన అవసరమని పుల్లంపేట కార్యదర్శి, బాధ్య ఈవోపీఆర్డీ పెంచలయ్య పేర్కొన్నారు. పుల్లంపేట ఆదర్శపాఠశాల వృత్తివిద్యా కోర్సు విద్యార్థులకు శుక్రవారం సచివాలయం సందర్శన, ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్ర పర్యటనతో విద్యార్థులు త్వరగా అవగాహన చేసుకుంటారన్నారు. ఆదర్శపాఠశాల ఒకేషనల్ శిక్షకులు తేజవర్మ, చైతన్యకుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వం మెప్పు కోసమే సనాతన దీక్ష'

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం మెప్పుకోసమే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి మాట్లాడటం, దీక్షలు చేయడం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గాజుల భాస్కర్ మాట్లాడుతూ.. దీక్షలు చేసుకుంటూ ప్రజా సేవను విస్మరించడం పవన్ కళ్యాణ్‌కు తగదని హితవు పలికారు.

పింఛ జలాశయం సందర్శన

సుండుపల్లి, న్యూస్‌టుడే: జల వనరుల శాఖ రాయచోటి డీఈగా ఈ నెల ఒకటిన బాధ్యతలు స్వీకరించిన చంగల్రాయుడు మండలంలోని వై.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయాన్ని శుక్రవారం సందర్శించారు. బదిలీపై వెళ్లిన ఏఈ మధుసూదనరావు నుంచి పింఛ జలాశయ వివరాలు, జరిగిన పనులు, జరగాల్సిన పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యపురానికి చెందిన గిరిజన రైతు అమృతనాయక్ పింఛ కుడికాలువ గేటు అమరిక త్వరగా పూర్తి చేయాలని ఆయన్ను కోరారు. పింఛ జలాశయ ఏఈ నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.


జలవనరుల శాఖ డీఈకి పింఛ కుడికాలువ గేట్ అమర్చాలని విన్నవిస్తున్న స్థానికులు

ఉత్తమ సేవలకు గుర్తింపు

వీరబల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవో జి.రఘురామయ్య యోగివేమన విశ్వవిద్యాలయం నుంచి వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ పీవోగా పురస్కారం అందుకున్నారు. కళాశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచడం, చెట్లు పెంచడం, పల్లెలలో శిబిరాలు ఏర్పాటు చేసి వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో అవార్డు దక్కిందని నిర్వాహకులు తెలిపారు. విశ్వవిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికలతో ఎన్‌ఎస్‌ఎస్ పీవో రఘురామయ్య, నిర్వాహకులు

నట్టేట ముంచిన వేరుసెనగ

సరైన దిగుబడులు లేక రైతులకు ఇబ్బందులు

- న్యూస్‌టుడే, చిన్నమండెం

ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుసెనగ పంట కాయ దశలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో రైతులను నట్టేట ముంచింది. పంట నిలువునా ఎండిపోవడం, అరకొరగా పచ్చగా ఉన్న కాయలు నాలుగైదు ఉండడంతో పాటు తొర్రలుగా మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధికారులు పలు మండలాల్లో నిర్వహించిన పంటకోత ప్రయోగాల్లో వర్షాధారంగా సాగు చేసిన పంటలో 55 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నూర్పిడి చేయగా కేవలం కిలో నుంచి రెండున్నర కిలోలే దిగుబడులు వచ్చాయంటున్నారు. ఈ లెక్కన ఎకరా విస్తీర్ణానికి కేవలం నాలుగు నుంచి ఐదు బస్తాలే దిగుబడి వస్తోంది. పంట సాగు చేసిన సమయంలో పెట్టిన ఖర్చులు కూడా రావని రైతులు లబోదిబోమంటున్నారు. రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 8750 ఎకరాల్లో పంట సాగైనట్లు అంచనా. కనీసం ఎకరాకు రూ.10వేలు నష్టం అనుకున్నా రూ.8.75 కోట్లను రైతులు నష్టపోతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


దిగుబడులు సరిగా రాలేదని చెబుతున్న మహిళా రైతు నాగసుబ్బమ్మ

ఆరు బస్తాలయ్యాయి



ఎకరన్నర విస్తీర్ణంలో పంట సాగు చేశా. సరైన సమయంలో వానలు కురవక పంట దెబ్బతినింది. నూర్పిడి చేస్తే ఆరు బస్తాలయ్యాయి. పెట్టుబడి రూ.20వేల వరకు అయింది. రూ.10 వేల వరకు నష్టం వచ్చింది. నాకే కాదు వర్షాధారంగా పంట సాగు చేసిన రైతులందరిది ఇదే పరిస్థితి. ప్రభుత్వం వేరుసెనగ రైతును ఆదుకోవాలి.

- రామచంద్ర, రైతు, కొండమూల